# వేకువ

కుమారి ఆ విశాలమైన భవనం వైపు మరోమారు పరిశీలనగా చూసింది.

చూస్తూండగానే తను ఎదురు చూస్తున్న వరం బయటకు వచ్చింది. కుమారి చప్పున కదిలి బడ్డీకొట్టు చాటున నక్కింది.

వరం నిర్లక్ష్యంగా చేతిలోనిచెత్తబుట్టను ఊపుకొంటూ, తిన్నగా బడ్డీకొట్టుకు అటువైపు వున్న చెత్తకుండీ వైపు వెళ్ళింది. బుట్టలోని చెత్తను అల్లంత దూరాన్నుండే కుండీ పైకి విసిరేసింది. అంత నిర్లక్ష్యంగానే బుట్టను ఊపుతూ మళ్ళీ భవనం లోపలకి వెళ్ళింది.

ఆ అయిదు నిమిషాలూ కుమారి ప్రాణాలు ఉగ్గబట్టుకొని వుంది. ఇది మొదటిసారేం కాదు. గత నాలుగు రోజులుగా ఇదే తంతు.

రమణ బండి మీదెళ్ళి మూడు వారాలయ్యింది. వెళ్ళినవాడు వెళ్ళినట్లే వెళ్ళాడు. టాక్సీ ఓనరు రేపంటాడు మాపంటాడు. రమణ వెళ్ళేప్పుడు ఖర్చులకిచ్చిన పాతిక రూపాయలూ ఎప్పుడో అయిపోయాయి. ఎసట్లో బియ్యం అంగట్లో సరుకయ్యే.. అయినా ఎవర్నని ఏం లాభంలే- కుమారి నిట్టూర్చింది.

ఏది ఏమైనా ఈసారి కుమారి వరాన్ని పలకరించాలనే నిశ్చయించుకుంది. అంతలోనే ఏదో అపరాధభావం, దాన్నంటే ఏదో అనుమానం కుమారిని ఆవరించింది. వరం పలకరిస్తుందో పలకరించదో.

పస్తులున్న శరీరం ఒక నిలవలేనంటూ నీరసంతో కూలబడింది. మగతగా వాలిపోతున్న కళ్ళను ఏదో ఆశ ఆధారమై నిలబెడుతోంది.

నిన్న దాదాపు ఇదే సమయానికి వరం పని ముగించుకొని బయటకు వచ్చేసింది. తనను గమనించి వరం చూసిన చూపు కుమారిని ఇంకా వెంటాడుతూనే వుంది. ఏ బొద్దింకనో ఏ పేడ పురుగునో తనలా చూసుండదు. కుమారి మనసు మళ్ళీ బలహీనపడింది. అక్కణ్ణించి వెళ్ళిపోదామన్న కోరికను ఆకలి జయించింది. కుమారి ఆ భవనం గేటు దగ్గరకి వెళ్ళి నిల్చుంది.

వరం నిర్లక్ష్యంగా నడుచుకుంటూ వస్తోంది. వరం దగ్గరకి రాగానే కుమారి నెమ్మదిగా పిలిచింది. వరం గిరుక్కున కుమారి వైపు తిరిగింది. మొహం చిట్లించింది. చూట్టూ తేరిపార జూసింది.

కుమారి మనసు చివుక్కుమంది. ఎంతయినా తోడబుట్టిన చెల్లెలు!

కుమారి కూడదీసుకుని పలకరించింది. ''వరం బాగున్నావా?''

'' ఆ...!''

కుమారి తల దించుకుని స్కూలు పిల్లలా అడగాలనుకుంది టకటక అప్పజెప్పింది.

''మీ బావ వూరెళ్ళాడు. ఖర్చులకేమైనా సర్దుతావేమోనని...!''

వరం కుమారిని ఎగాదిగా చూసింది. కుమారికి ఆ చూపులు కొరడాదెబ్బల్లా తగిలాయి.

వెలిసిపోయిన నీలంరంగు చీరలో కుట్లుపడిన జాకెట్టులో పాలిపోయిన మొహంతో అసలు కుమారేనా అన్నట్లుగా వుంది కుమారి.

''కోరి తెచ్చుకున్న దరిద్రం!'' వరం మనసులోనే అసహ్యించుకుంది.

''నా దగ్గర మాత్రం ఎందుకుంటయ్యా..!'' పైకి ఓ దీర్ఘం తీసింది.

మళ్ళీ ఏమనుకుందో ఏమో బడ్డీకొట్టు పక్క నున్న పాకహోటల్‌కి దారి తీసింది వరం.

కుమారి మౌనంగా వరాన్ని అనుసరించింది. వరం అందించిన టీని లాక్కున్నట్లుగా తీసుకొని గబగబ... ఆత్రంగా...తాగింది. అక్కను చూసి నిట్టూర్చింది వరం.

'' ఎందుకొచ్చిన ఖర్మ?'' అప్రయత్నంగా పైకే అనేసింది వరం.

'' ఎప్పుడిట్లా జరగలా! ఏదో జరిగుంటుంది. లేకపోతే రమణ ఎన్నడూ ఇలా చేయడు!''

''రోషానికి ఏం తక్కు వ లేదు!'' వరం గొణిగింది. ఆడు సుబ్బరంగా రత్నింట్లో వున్నాడు. నిన్నేకదా తను చూసింది వరం పైకి అనలేదు.

ఇద్దరూ కాసేపు మాటలు కరువైనట్లుగా మౌనంగా కూర్చున్నారు.

''మా ఆయన నన్ను నీతో కానీ చూసాడంటే చంపేస్తాడు!'' చటుక్కున అంది వరం.

కుమారి కిమ్మనలేదు. కాసేపటికి ఎన్నాళ్ళ మౌనమో తెంచుకున్నట్లుగా అంది.''మీనా ఎలా వుంది?''

''నిక్షేపం లాగుంది!''

''నన్నెప్పుడైనా అడుగుద్దా...'' కుమారి అడుగుదామనుకొన్న ప్రశ్న గుండె అడుగున పడిపోయింది.

''నేను పోతున్నా రేఖమ్మ గారింట్లో పనిమనిషి రాలేదంట రమ్మన్నారు.'' వరం తనలో తను చెప్పుకున్నట్లుగా అంది.

కుమారి వరాన్ని అనుసరించింది

ఎందుకొస్తున్నావని వరం కుమారిని అడగలేదు. తాగించిన టీకి సరిపడా పనేదైనా చేస్తుంది లెమ్మని వూరుకొంది.

రేఖ మాత్రం వూరుకోలేదు. గడపలో అడుగుపెట్టగానే ఎవరీ కొత్త మనిషి అంటూ గుచ్చిగుచ్చి అడిగినంత పనిచేసింది.

''మా వీధేనమ్మా... కాస్త సాయంగా వుంటుందని తీసుకొచ్చా!'' వరం సర్దిచెప్పింది.

కుమారికి చివుక్కుమనిపించింది. అక్క అని చెప్పుకోవడానికి కూడా నామోషీ కాబోలు.

వరం పైపైన పనిచేస్తున్నట్లుగానే కుమారితో పనంతా చేయించింది. పనయ్యాక రేఖ వరంతో పాటు కుమారికి తినడానికి పెట్టింది. కాఫీ ఇచ్చింది.

కుమారికి ప్రాణం కుదుటపడింది. వరం తాగించిన టీ నీళ్ళ కన్నా ఈ అన్నం ముద్ద ఎంతో తృప్తినిచ్చింది.

వరం కుమారి ఆశించిన వివరాలేం ఎత్తకుండానే తన దారిన తాను పోయింది.

కుమారి కాళ్ళీడ్చుకొంటూ ఇంటికి నడిచింది.

ఇంటి గేటు లాంటి తడిక దగ్గర ఇంటి ఓనరు నిల్చొని వున్నాడు.

'' ఏవే... రమణ ఈ పూట కూడా రాడంటనా?'' దీర్ఘాలు తీస్తూ అదోలా నవ్వాడు.

'' ఏమోలే అన్నా...'' కుమారి అదో ప్రాధాన్యత లేని ప్రశ్నలా తేల్చి పారేసింది.

'' ఏమయినా అనుకానీ అలా మాత్రం పిలవకు. రమణ ఏ అర్ధరాత్రో అపరాత్రో వస్తే అద్దె విషయం గుర్తు చెయ్యి. మర్చిపోకు.''

''సరే అన్నా...'' కుమారి దాదాపు అతని మొహం మీదే తలుపేసుకుంది. కొంగుతో మొహం తుడుచుకుంటూ చుట్టూ చూసింది. గచ్చులేని

నేలతో...చిల్లుల కప్పుతో... ఇదీ ఓ ఇల్లేనా?

ఓ పక్కన దండెం మీద వేళ్ళాడుతున్న పాత చీర. వంటి మీదో చీర, దండెం మీదో చీర. ఇలాంటివి తను మీనా పక్కకి వాడేది కాదూ!

ఎలాంటి ఇల్లు అది! ఎలాంటి బతుకు అది!

బుజ్జయ్య-కొయ్య పనిచేసే తన తండ్రికి మేస్త్రీ. పుట్టింటికన్నా అన్ని విధాలా మెరుగైన జీవితం. ముచ్చటైన మూడు గదుల ఇల్లు. చిన్న టి.వి., రేడియో, స్టవ్, స్టీలు సామాను... ఇంకా ఎన్నెన్నో.

తనకు, మీనాకు వంటి మీద బంగారు గొలుసు, గాజులు, కాళ్ళకు వెండి పట్టాలు వుండేవి కావూ!

కుమారి అప్రయత్నంగా మెడ తడుముకుంది.

బోసి మెడ బొమికలు గట్టిగా తగిలాయి.

గదిలో వున్న ఒక్క కరెంట్ లైట్ ఆరిపోయింది.

అప్పుడే ఎనిమిదయినట్లుంది. కరెంట్ ఆపేయడానికి అరనిమిషం వృధా పోనీయడు. కుమారి ఇంటి ఓనరును తిట్టుకుంది. తడుముకుంటూ లేచి కిరసనాయిలు బుడ్డి వెలిగించింది.

ఇలాంటి గుడ్డి వెలుతురులోనే తను రమణకు వంటి మీది నగలు వలిచి ఇచ్చింది-రమణ ఆర్.టి.సి. ఉద్యోగం కోసం. రమణకు ఉద్యోగం వచ్చిందా? రాలేదా? ఏమో..వస్తుందో..రాదో? ఆ ఉద్యోగంతో తమ కష్టాలన్నీ తీరిపోతాయన్నాడు రమణ. మొదట కాస్త మంచి ఇల్లు తీసుకోవాలి.

ఇల్లు అనుకోగానే..కుమారి కళ్ళ ముందు మీనా కదలాడింది. బుడ్డిని చేతిలోకి తీసుకొని ట్రంక్ పెట్టె దగ్గరికి వెళ్ళింది. నెమ్మదిగా దాంట్లో సరంజామానంతా బయటకు తీసింది. పెట్టెలో అడుగున వున్న ఓ పాత ఫోటోను జాగ్రత్తగా పైకి తీసింది. బుడ్డి వెలుతుర్లో మసక మసగ్గా కనిపిస్తున్న మీనా రూపాన్ని ఆప్యాయంగా తడిమింది.

తను స్వయంగా మల్లెలు కనకాంబరాలతో మీనాకు కూర్పుజడ వేసి ముచ్చటపడి తీయించిన ఫోటో. ఫోటో తీసే నాటికి పదమూడేళ్ళదైనా నిండా పదేళ్ళయినా లేనట్లుగా వున్న బలహీనపు పుటక, చిన్నగా...సన్నగా...ముద్దుగా..

ఎంత చక్కని కంఠమని, అందరూ చుట్టూచేరి పాటలు పాడించుకొనేవారు. పెద్దయితే ఏ సుశీలో ఏ జానకో అవుతుందనే వారు. ఇప్పుడు పాడుతోందో లేదో.

కుమారి మీనా వైపు అలా చూస్తుడి పోయింది. తెలియకుండానే కళ్ళల్లో నీళ్ళూరాయి. కుమారి మీనాను ముద్దాడి ఫోటోను భద్రంగా పెట్టెలో సర్దేసింది.

ఎంత అపురూపంగా పెంచుకుందో... ఎంత మురిపెంగా చూసుకుందో...కనీసం తనను తలుచుకోనైనా తలుచుకోదేమో! ఎందుకు తలుచుకోవాలి? ఆనాడు తను ప్రేమ తరాజులో తల్లి ప్రేమను తేలిక చేసేగా రమణతో వచ్చేసింది.

కుమారి చుట్టూ చూసింది.

ఏదో శూన్యం ఏదో దైన్యం కుమారి చుట్టూ జీరాడుతున్నాయి.

ఆలోచనలతో తెల్లవారేలోగా కుమారి ఓ నిశ్చయానికి వచ్చింది. ఏది ఏమైనా వరాన్ని మంచి చేసుకొని, మీనాని తన దగ్గరకి రప్పించుకోవాలి. రమణ తన మాట కాదనడు. రమణకు తనంటే, తన మాటంటే ప్రాణం.

కుమారి, మీనా తన దగ్గరకు వచ్చినట్లే కలలతో నిద్రపోయింది.

మర్నాడు... ఆమర్నాడు.. వరం దగ్గరకి వెళ్ళింది. రేఖ ఇంటికి పనికి వెళ్ళింది. వరం మీనా కబుర్లేవైనా చెబితే భద్రంగా గుండెలో దాచుకుంది.

మొదట్లో లాగా వరం అసహ్యించుకోవడం లేదు. అలాగని చనువు ఇవ్వడం లేదు. అభావంగా వుండిపోతోంది. కుమారి బిడియపడకుండా వస్తూ పోతూవుంది.

మూడో రోజు తెల్లవారుఝామున రమణ వచ్చాడు. చడీ చప్పుడు లేకుండానే.

కుమారి ఎప్పటిలా తగువుకి దిగాలనుకోలేదు. నిర్లిప్తంగా వూరుకుంది. రమణ హడావుడి చేసాడు. తను తెచ్చిన బెంగళూరు మిఠాయిలు స్వయంగా నోట్లో పెట్టాడు. జేబులోంచి డబ్బు తీసి కుమారి చేతిలో పెట్టాడు. కుమారి వళ్ళో తల పెట్టుకొని, ఇన్నాళ్ళుతానెక్కడెక్కతిరిగాడో, ఎన్నెన్ని తిప్పలు పడ్డాడో ఏకరువు పెట్టాడు.

కుమారి మౌనం మంచులా కరిగిపోయింది.

గబగబ పొయ్యి ముట్టించి, తలంటుస్నానానికి సిద్ధం చేసింది. చేపలు తెచ్చి, పులుసు పెట్టింది. వడ్డించబోతుండగా కుమారికి మీనా గుర్తుకు వచ్చింది.

ఈ రోజు వరం మీనాని కదిలించి చూస్తానంది. మీనా ఏమందో...

కుమారికి ఎప్పుడెప్పుడు వెళ్ళి మీనాను కలుద్దామా అని వుంది. రమణ వచ్చిన ఉత్సాహమే లేదు. రమణ రెండ్రోజులు ఇంట్లోంచి కదల్లేదు. కుమారిని కదలనీయలేదు. కుమారి ఉత్కంఠ భరించలేకపోతోంది. రమణతో వచ్చిన తరువాత రమణ సమక్షంలో ఇంతటి అసంతృప్తి, అలజడి ఇదే మొదటిసారి.

ఎలాగోలా వంట చేసి, ఎండు చేప వేయించి, రమణకు వడ్డించింది. రమణ పక్కనే కూర్చుని పాత అట్టని విసన కర్రలా వూపుతూ....విషయంలోకి వచ్చింది.

''నువ్వా పక్కకి వెళ్ళినపుడు మీనా కానీ కన్పించిందా...!''

రమణ చేపముక్క కరకరలాడిస్తున్న వాడల్లా ఆగి, కనుబొమలు పైకెత్తి అన్నాడు కాస్త ఆశ్చర్యంగా...కాస్తవెటకారంగా...''అమ్మగారికి ధ్యాస మళ్ళింది మీనా మీదా? మీనా బాబు మీదా?''

కుమారి చివ్వున తలెత్తింది.

''ఏవైనా పాత జ్ఞాపకాలు, పాత మోజులు తిరగ తోడ్తున్నావేమోనని...'' రమణ వంకరగానవ్వాడు.

కుమారి మౌనంగా వుండిపోయింది.

'' ఆడు మాత్రం బ్రహ్మాండంగా వున్నాడు. కొత్త పెళ్ళాం. కొత్త మోజు, ఎంతయినా తాజా సరుకు కదా!'' హేళనగా అన్నాడు రమణ.

బుజ్జయ్య రమణని ఏనాడైనా ఆడిపోసుకున్నాడా? మరి రమణ కెందుకు బుజ్జయ్య ఊసు?

కువమారి పెదవులు సన్నగా వణికాయి. వరంని కలిసిన విషయం చెప్పదలుచుకోలేదు.

రమణ అదేం పట్టించుకోకుండా...గబగబ తినేసి, బయటకు వెళ్ళాడు.

ఈ అవకాశం కోసమే కాచుకున్నట్లుగా వరం దగ్గరకి బయలు దేరింది కుమారి. రమణ తెచ్చిన బెంగుళూరు మిఠాయిలను ఓ కవర్‌లో పెట్టుకోవడం మర్చిపోలేదు.

వడివడిగా వస్తోన్న కుమారి పాకహోటల్ దగ్గరకి రాగానే టక్కున ఆగిపోయింది.

హోటల్ పక్కనే వున్న కరెంట్ స్తంభానికి వేసిన సిమెంటు దిమ్మెపై వరం కూర్చుని వుంది. పక్కనే రత్న! కుమారి చటుక్కున హోటల్ పక్కగా వారికి కనపడకుండా నక్కింది.

రత్న బొంగురుపోయిన గొంతుతో అంటోంది. ''నా పాలిటి ఇదెక్కడ దాపురించిందే వరం, నిన్న రాత్రి పడుకున్నాడు పడుకున్నట్లే లేచెళ్ళాడు!''

రత్న కాసేపు వెక్కిళ్ళు పెట్టింది. వరం ఓదార్పుగా రత్న భుజాన చెయ్యి వేసింది.

''నేను దానికి ఏం అపకారం చేసానని నా కాపురం బద్దలు చేసింది. పిల్లలు ఈసురో మంటున్నారు. ఆళ్ళ ఉసురు దానికి తగలకుండా పోద్దా?'' రత్న మెటికలు విరిచింది.

కుమారి గుటకలు మింగింది. వరం మాట్లాడ లేదు.

''అయినా ఆ పాపిష్టి దానికి నా మొగుడే దొరికాడా? హవ్వ! ఛీ ఛీ!! అయినా నా కర్మ ఇట్లా ఏడిచింది. సుఖంగా కాపురం చేసుకొనే రాత లేదు. పరాయిదన్నా అయితే ఎట్లా చచ్చేదో...!థూ...! ఆ మహాతల్లి ఏం ముందు పెట్టిందో...! దాని పీడా విరగడ అయితే గానీ నాకు సుఖం లేదు. అది నాశనం కానూ....! దాని దెవసంపెట్టా...!'' రత్న ఏకధాటిగా శాపనార్థాలు పెడుతోంది.

కుమారి నిస్సహాయంగా అక్కణ్ణించి కదల్లేక చెవులప్పగించి నిలబడింది.

''ఏవైనా వుంచుకున్నది కట్టుకున్న దాంతో సమానమవుతుందా? ఎన్నాళ్ళు సాగుద్ది దీని భాగోతం? బిడ్డల మొహం చూసైనా ఆయన రాడూ?'' రత్న, కుమారిని తిట్టి, తిట్టి... తీర్మానించి...వెళ్ళిపోయింది.

రత్న వెళ్ళాక కాసేపు వరం కూర్చున్న చోటి నుండి కదల్లేదు. తరువాత తిన్నగా కుమారి దగ్గరకి వచ్చింది. కుమారి నేలలోకి పాతేసినట్లుగా తల వాల్చేసి కూర్చుని వుంది.

''చాల్లే చేసిన నిర్వాకం! ఇందాక బయటకు కనుక వచ్చుంటే..రత్న నీమొహం పచ్చడి చేసుండేది!'' వరం ఈసడించుకుంది.

కుమారి దించిన తలను మరింత వాల్చేసింది. ఇద్దరూ చాలా సేపు ఏమీ మాట్లాడలేదు.

''ఏంటిలా వచ్చావు?'' వరం ఆరా తీసింది.

''ఇవి మీనాకు ఇస్తావని!'' కుమారి స్వీటు ప్యాకెట్‌ను వరం ముందుకు చాచింది. వరం లాక్కున్నట్లుగా అందుకుంది. '' ఊం... స్వీట్లు! మొత్తానికి బావ నిన్ను బాగానే చూసుకుంటున్నాడే!'' అంటూనే ఓ నాలుగు పరపర నమిలేసింది.

కుమారికి వరం కంఠంలో తొణికిన భావమేంటో అర్థం కాక కాస్త అయోమయంలో పడింది.

వరం మిగిలిన స్వీట్లు సంచిలో పెడుతూ అంది, ''మీనా నువ్విచ్చావని చెబితే చచ్చినా ముట్టుకోదు. నేను తెచ్చిచ్చానంటే నమ్మదు. సరేలే... లక్ష్మితో పంపిచూస్తా!'' వరం భారం ఎత్తుకున్నట్లుగా అంది.

లక్ష్మి వరం కూతురు. మీనా వయసుదే. ఇద్దరిదీ ఒకే బడి.

కుమారి సమాధానపడి - ఇంటి ముఖం పట్టింది.

వరంని కలిసానని, రత్నని చూసానని రమణతో చెపితే? హమ్మో! ఇంకేమయినా వుందా? రాద్ధాంతం చేయడూ? ఛ! అలా ఎందుకు చేస్తాడు? రమణ మంచివాడు.

కుమారి కడుపులో ఎక్కడో కలుక్కుమంది. కుమారి అభోజనంగా ముసుగుదన్నింది. కుమారి కళ్ళకు కునుకు పట్టనీయకుండా - రత్న మొహమే కదలాడుతోంది. చక్కగా ఎప్పుడూ నవ్వుతూ కళకళలాడుతూండే ఆ మొహం ఇప్పుడెలా తయారయిందో! కుమారికి చివుక్కుమనిపించింది.

రత్న-కుమారి పెత్తల్లి కూతురు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు. కలిసి ఆడారు. నవ్వారు.

కుమారి కడుపులో సన్నగా నొప్పి మొదలయ్యింది.

ఈ మధ్య ఎందుకనో తరుచూ కడుపునొప్పి వస్తోంది. అన్నిటికి తోడు ఇదోటి! కుమారి గొణుక్కుంటూ లేచింది. మంచి నీళ్ళు తాగి-ముడుచుకు పడుకుంది.

దీనంగా ఏడుస్తున్న రత్న, గుండెలు బాదకుంటున్న రత్న, జుట్టు పీక్కుంటున్న రత్న, శాపనార్థాలు పెడుతోన్న రత్న- ఒక చిత్రం తరువాత ఒక చిత్రం కుమారి కళ్ళ ముందు కదలాడింది.

ఇన్నాళ్ళూ తన కళ్ళకు ఇవన్నీ ఎందుకు కనబడలేదు? కుమారి విలవిలలాడి పోయింది.

అయితే, రమణను రత్న దగ్గరే వుండిపోమని చెప్పేయనా? హమ్మో...రమణ లేకుండా తను బతకగలదా? కుమారి ఆలోచనలో మునిగి పోయింది.

అయినా, రత్న కేం రోగం? పస్తులుందా? చాటుమాటు సంసారం చేస్తోందా? అయిన వాళ్ళందరిని వదులుకువచ్చిందా? దానికి జరగాల్సినవన్నీ బాగానే జరిపించుకుంటోంది. ఇంకేంటట? ఏడుపు గొట్టు మొహం కాకపోతే?

కుమారి ఆలోచనల్లోంచి రత్నను తుడిచేసింది.

నిజంగానే రత్న, ఆమె పిల్లలు రమణని తన దగ్గరకు రానీయకుండా చేస్తే... తనేం చేయాలి? బుజ్జయ్య దగ్గరికి తిరిగి వెళ్ళగలదా? ఊహు... అది జరగని పని. మరి కూడు, గూడు, జరిగేదెలా?

కుమారి పన్లోకి వెళ్ళాలని నిశ్చయించుకొంది. రేఖ ఇంట్లోనే పనికి కుదిరింది.

కుమారి పనిలోకి వెళ్ళడం మొదలెట్టాక పదిరోజులు రమణ రానేలేదు. పదిరోజుల్లో మనుషుల్లో తిరగడం అలవాటయి కొత్తగాలి పోసుకున్నట్టుగా వుంది. పని కూడా తేలికే. మూడు పూటలా తిండి గడిచిపోతోంది. ఇక వరం కలుస్తూనే వుంది. మీనా విషయాలు తెలుస్తూనే వున్నాయి.

''నీలాంటి దాన్నెవరో పన్లోకి తీసుకుంది!'' అంటూ పెళ్ళున నవ్వేసాడు రమణ. విషయం తెలిసి, రమణ వెటకారాలు, వెక్కిరింతలు ఎలా వున్నా అతనికి పెద్ద అభ్యంతరమేమీ లేదు. తరవాత్తరవాత అదే మేలనిపించింది.

అస్తమానం డబ్బు కావాలన్న నస తగ్గింది. రమణకి ఊపిరి పీల్చుకున్నట్టుగా వుంది. మొదట్లో అప్పుడప్పుడూ తరువాత తరుచూ కుమారే రమణకి డబ్బు సర్దుతోంది. కుమారి ఇక ఎలా పోతే అతనికెందుకు?

ఓ రోజు వరం ఓ వార్త మోసుకొచ్చింది.

''మీనాకి పెళ్ళంట!''

కుమారికి మతిపోయినట్లయింది. నిండా పదిహేనేళ్ళు లేవు. ఇప్పుడేం పెళ్ళి? అదే అంది.

''వయసొచ్చేదాకా ఆపితే ఆళ్ళమ్మలాగే ఏవన్నా....'' వరం కుమారి ముఖంలో మారిన రంగుల్ని చూసి మాటలు మింగేసింది.

''మీ అత్తే అంది!'' వరం కాసేపాగి అంది.

కుమారి చాలాసేపటి వరకూ మాట్లాడలేకపోయింది.

అదీ నిజమే. తన అత్తకు తనేమైనా అనే అధికారం వుంది. తనుగానీ, బుజ్జయ్యగానీ మీనాను పట్టించుకుంది ఎప్పుడసలు? ఆవిడ మీనాను కడుపులో పెట్టుకొని పెంచుకుంది. మీనా విషయంలో ఏ నిర్ణయమైనా తీసుకొనే హక్కూ, ఆమెకే వున్నాయి. కన్నంత మాత్రాన సరిపోతుందా? కుమారి నిట్టూర్చింది.

''రమేష్‌తో నేనా?'' కుమారి ఎప్పటికో మెల్లిగా అడిగింది.

''ఆ!''

రమేష్ కుమారి ఆడుపడుచు కొడుకు. తల్లి చిన్నప్పుడే పోయింది. మారుటి తల్లి వచ్చాక అమ్మమ్మ గారింటికి వచ్చేసాడు. పదో తరగతి ఫెయిలవగానే కొయ్యపనిలోకి దిగాడు. మీనా కన్నా ఐదేళ్ళు పెద్ద.

''ఎలాగూ పెళ్ళి రమేష్‌తోనే అనుకున్నారుగా... ఓ ఏడాది ఆగితే మీనా పదోతరగతి అన్నా అయిపోయేది.'' కుమారి దిగాలుగా అంది.

వరం నిజమేనన్నట్లు తలాడించింది.

కుమారి చివరికి అడగలేక అడిగింది, ''మీనా వాళ్ళ నాయన ఏమన్నాడూ?''

''అంతా మీ అత్త ఇష్టమేనన్నాడంట!''

''అంతేలే! అంతేలే!'' కుమారి గొణిగింది.

''రమేష్ సవిత్తల్లి తొందరంట ఇదంతా. ఆమెది వళ్ళో బిడ్డ వంట్లో బిడ్డ యవ్వారమయ్యే...రమేష్ పెళ్ళామయితే చేదోడు వాదోడుగా వుంటుందనీ....'' వరం సాగదీసింది.

కుమారి ఆ దృశ్యంలో మీనాని ఊహించుకుంది.

అసలే చిన్నతనం. అందులో బలహీనం, ఆ కాపురం ఎట్లా చేసుద్దో...కుమారి అసహనంగా కదిలింది.

''బుజ్జయ్య బావ మాత్రం ఏం చేస్తాడూ.... నాలుగేళ్ళు ఆగైనా బయటి సంబంధం చేయచ్చులెమ్మనుకొంటే - తల్లి భాగోతం తెలిసి ఎవడు ముందుకొస్తాడని మీ మరిది దగ్గర బాధపడ్డాడంట....'' వరం జోరుగా చెప్పుకుపోతోంది.

కుమారి ముభావంగా ఇంటి దారి పట్టింది.

మీనా.... తన చిట్టి తల్లి....మీనా చుట్టూ అల్లుకున్న తన చిన్నస్వప్నం ...మీనాని కొంతలో కొంత చదివించి, ఓ టీచర్‌గానో... ఓ నర్స్‌గానో.... చూడాలన్న చిన్న ఆశ.

కుమారి మనసు మనసులో లేదు. అప్పుడే పెళ్ళి, సంసారం, పిల్లలు. ఎలాగైనా ఇది జరగకుండా ఆగిపోతే బావుణ్ణు. కుమారి మనసారా కోరుకుంది.

ఓ రోజు కుమారిని కలవడానికి రమేష్ వచ్చాడు.

కుమారి అతన్ని బతిమిలాడింది - పెళ్ళి మరో రెండేళ్ళు వాయిదా వేసుకోమని.

''లేదత్తా - ముహూర్తాలు కూడా పెట్టేసారు. అయినా మీనా సంగతి నాకు తెలీదూ....బాగా చదివిస్తాలే!'' భరోసా ఇచ్చాడు రమేష్.

కుమారి అంతటితోనే తృప్తి పడింది. పెళ్ళి వ్యవహారాలు ఆరా తీసింది.

రమేష్ తల్లి అడిగిన రెండువేలూ సర్దడానికి ఇబ్బంది పడుతున్నాడట బుజ్జయ్య.

ఆ మాట ఈ మాట చెప్పెళ్ళాడు రమేష్.

కుమారి రమణ దగ్గర భయం భయంగా, చూఛాయగా విషయం ఎత్తింది.

'' ఓస్ అంతేగా! ఓ వెయ్యినువ్విస్తావని చెప్పు!'' రమణ తేలిగ్గా అనేసాడు.

'' ఎక్కణ్ణించి తేవాలి?'' కుమారి దిగాలుగా అంది.

''అది నాకొదిలేయ్. మీనా పెళ్ళి బహుమతి ఇవ్వాలిగా!'' దర్పంగా అన్నాడు రమణ

కుమారి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. మీనా విషయం ఎత్తితేనే ఏమనుకొంటాడో అని అనవసరంగా భయపడింది. రమణకు తన మనసు తెలీదూ... కుమారికి రమణ మీద ప్రేమ అమాంతం పెరిగిపోయింది.

పెళ్ళి పదిహేనురోజుల్లోకి వచ్చింది. రమణ డబ్బు సమకూర్చుకొని మర్నాడే వస్తానని వెళ్ళాడు.

మర్నాడు పోయింది. వారం పోయింది. రమణ రాలేదు.

కుమారికి చెప్పలేనంత దిగులుగా వుంది. రమేష్‌తో, వరంతో తనెంతో ఘనంగా చెప్పింది. ఆ వరం తెలిసిన వాళ్ళందరికి మరింత ఘనంగా చెప్పింది. ఇప్పుడు డబ్బు సర్దకపోతే ఎంత నామర్దా? అసలు...అసలు...చుట్టాల ముందు.. అత్తముందు... ముఖ్యంగా బుజ్జయ్య ముందు...తల కొట్టేసినట్లవదూ?

కుమారికి ఏం చేయాలో తోచలేదు.

టాక్సీ ఓనరు చుట్టూ కాళ్ళరిగేలా తిరిగింది. రమణ ఎక్కడి కెళ్ళాడో తెలీదంట. సాటి డ్రైవర్లందరినీ అడిగింది. క్లీనర్లని అడిగింది. అందరూ కూడ బలుక్కున్నట్లు ఒకటే సమాధానం. తెలీదు.

పెళ్ళి నాలుగు రోజులుందనగా మళ్ళీ టాక్సీ ఓనరు దగ్గరకి వెళ్ళింది. రమణ తన కోసం డబ్బు ఏమైనా పంపాడేమోనని అడిగింది.

'' ఆడు అట్టాంటిదేం పంపలా... ఆడు రాలా...నువ్వేమయినా వస్తావేంటే...!'' కన్నుగీటాడు. కుమారి మౌనంగా వెనక్కు మళ్ళింది.

డబ్బు సర్దలేని తన నిస్సహాయత గురించి వరం దగ్గర వాపోయింది కుమారి. రేఖను అడిగిచూడమని వరం సలహా ఇచ్చింది.

రమణ డబ్బు తీసుకురావడానికి వెళ్ళాడనీ... ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బు తీసుకొనే వస్తాడని ఎంతో నమ్మకంతో ఎంతో నమ్మకంగా చెప్పింది కుమారి-రేఖను డబ్బడుగుతూ.

రేఖ ఏమనుకుందో ఏమో వెంటనే డబ్బు తీసిచ్చింది.

క్షణాల్లో డబ్బు చేరాల్సిన వారికి చేరింది.

రమేష్ ఏ పూటకాపూట వచ్చి పెళ్ళి విశేషాలు చెప్పిపోతున్నాడు. వరం తన వంతు సమాచారం మోసుకువస్తోంది.

పెళ్ళి దగ్గర పడుతోన్న కొద్దీ కుమారిలో అలజడి పెరుగుతోంది. ఒక్కగానొక్క బిడ్డ. ఆ ఒక్కొగానొక్క ముచ్చట చూసుకొనే భాగ్యం లేకపోయెనే అని కుమిలి పోతోంది. నా బిడ్డ కాపురం పచ్చగా వుండాలి... ఈ పాపిష్టి చూపు పడడం దేనికిలే...అని సరిపెట్టుకుంటోంది.

వరం, వరం కూతురు మహా ఉత్సాహంగా పెళ్ళికి సిద్ధమవుతున్నారు. రేఖ కుమారికిచ్చిన చీరను పెళ్ళికి కట్టుకోవాలని తీసుకుంది వరం. కుమారి ముక్కుపుడకను వున్నపళాన తీయించి పెట్టుకుంది. మీనా పెళ్ళికి నాకేం పెడతావ్ పెద్దమ్మా అని అడిగి మరీ ముత్యాల గొలుసు, గాజులు కొనిపించుకుంది వరం కూతురు.

ఏం చేసినా కుమారికి దిగులు దిగులుగానే వుంది. మీనా తల్లిని అడిగినట్లుగా గానీ కనీసం ఆ మాటెత్తినట్లుగా గానీ సమాచారం లేదు.

రేపు మీనాని పెళ్ళి కూతుర్ని చేస్తారనగా వరం ఓ వార్త తీసుకొచ్చింది.

ఎవరో పెద్దాళ్ళు అన్నారంట-'దాని డబ్బులైతే పనికొచ్చాయి గానీ అది పనికి రాలేదురా? ఏదో చేసింది. అనుభవిస్తుంది. బిడ్డను పీటల మీద చూసుకోవాలని దానికీ వుండదూ? రమ్మని కబురెట్టండి' అని.

వరం వెనకే రమేష్ వచ్చాడు. ''అత్తా నువ్వు పెళ్ళికి రావలిసిందే'' నంటూ గొడవ చేసాడు.

కుమారి మాట మాత్రానికే తబ్బిబ్బైపోయింది. ఆనందంతో కళ్ళు చెమర్చాయి. కానీ, వెళితే ఏం బావుంటుంది? పెళ్ళికి వచ్చిన వాళ్ళందరూ అదుగో పెళ్ళి కూతురు తల్లి-ఫలాన ఫలాన-అని వేలెత్తి చూపితే-తన సంగతి

అటుంచి-మీనాకి ఎంత చెడ్డపేరు!

రమేష్, వరం చెరో పక్క సర్ది చెప్పారు.

''మీ బావొస్తే...'' గొణిగింది కుమారి.

''నువ్వేమయినా అక్కడే వుండిపోవడానికి వెళ్తున్నావా? శుభకార్యం...నాలుగు అక్షింతలు వేసి రావడానికి...కానీ! అయినా... ఆయన పెళ్ళాం బిడ్డల్ని వదులుకున్నాడా...నీ వెర్రి కాకపోతే...''వరం మూతి తిప్పుతూ దీర్ఘాలు తీసింది..

'' ఆయన్నెందుకు అంటావులే...'' కుమారి నసిగింది.

''నీ ఖర్మ! ఇంక నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో!'' వరం విసుక్కుని వెళ్ళిపోయింది. రమేష్ ఇంకోసారి పెళ్ళికి రమ్మని పిలిచి-వెళ్ళిపోయాడు.

కుమారికి వెళ్ళాలనే వుంది. కళ్ళారా కన్న బిడ్డను చూసుకోవాలనే వుంది. కుచ్చులు పెట్టి కూర్పు జడ వేసి, సరిగ చీర కట్టి, బుగ్గ చుక్క పెట్టి పెళ్ళి కూతుర్ని చేయాలనే వుంది. కానీ రమణకి చెప్పకుండా ఎలా?

కుమారి ఆ పూట మళ్ళీ టాక్సీ ఓనరు దగ్గరకి వెళ్ళింది. రమణ రాలేదు.

రాత్రంతా కనురెప్ప వాల్చకుండా ఎదురుచూసింది. కుమారికి తన అసహాయత మీద తనకే కోపంగా వుంది. రమణకు చెప్పకపోతే ఏం? రత్న దగ్గరకి వెళ్ళినప్పుడల్లా తనకి చెప్పే పోతున్నాడా? డబ్బు సర్దకపోతే పోయే...మనిషే కనిపించకుండా వెళ్ళాడు. అయినా ఎవర్నని ఏం లాభం? కన్ను కానక చేసిన పనికి మంచి అనుభవమే దొరికింది. కుమారి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

ఎంత గింజుకున్నా తెగింపు రాలేదు. పెళ్ళికి వెళ్ళేందుకు మొహం చెల్లటం లేదు. ఏడ్చి ఏడ్చి ఏడుపు కూడా మిగలలేదు. లేచి మొహం కడుక్కొని పనికి వెళ్ళింది-మీనాని పెళ్ళి కూతుర్ని చేసి వరం నేరుగా అక్కడికే వస్తుందేమోనన్న ఆశతో.

వరం వచ్చింది. 'అమ్మరాలేదేం పిన్నీ' అని మీనా అడిగిందని చెప్పింది.

మీనా ఆ ఒక్కమాట కుమారి సంశయాలన్నిటినీ తరిమికొట్టింది. రాత్రంతా అనుభవించిన దుఃఖం గుర్తుకు రాలేదు. రమణ గుర్తుకు రాలేదు. పరుగులు పెట్టి పెళ్ళి సమయానికి చేరుకుంది. అప్పటికే మీనా, రమేష్ పీటల మీద కూర్చున్నారు.

కుమారి మీనాను చూపులతోనే ఆప్యాయంగా తడిమింది. ఇద్దరినీ ముచ్చటగా, ముద్దుగా చూసుకొంది.

ఇంతలో బుజ్జయ్య, ఆయన భార్య పీటల మీద కూర్చున్నారు–మీనాకి చెరోపక్కా. కుమారికి ఏడుపు ముంచుకొచ్చింది. కొంగు నోటికడ్డం పెట్టుకొని...గబగబ పెళ్ళి పందిరి బయటకు నడిచింది.

''అక్కా!'' వెనక నుంచి వరం గొంతు.

కుమారి గిర్రున తిరిగింది. వరం పక్కనే బుజ్జయ్య తల్లి నిల్చుని వుంది.

''తినేసెళ్ళు!'' అనేసి మొహం తిప్పుకుందామె.

ఆమెను చూసి ఎన్నాళ్ళయిందో...అందరి మధ్య బాగా నలిగిపోయింది. ఎంతో వయసు మీద పడ్డట్లుగా వుంది. కుమారి అడ్డదిడ్డంగా తలాడించి..పరిగెత్తుకొచ్చి ఇంట్లో పడింది.

ఆ సాయంత్రం వరం వచ్చింది. కుమారిని చూసి అత్త ఎంతో బాధ పడిందట. ముద్దబంతిలా వుండేది ములక్కాడ అయ్యిందని కళ్ళు నీళ్ళు పెట్టుకొందిట. తీసుకెళితే మీనాని ఓ పూట తీసుకెళ్ళమందిట.

కుమారికి ఏం మాట్లాడాలో పాలుపోలేదు. కాసేపున్నాక గర్వంగా తలెగరేసి అంది, ''చూసావే వరం...నాలుగు డబ్బులు మొహాన పడేసరికి మా అత్త ఎలా తోకాడిస్తుందో!''

వరం కుమారి వంక ఆశ్చర్యంగా చూసింది.

చివరకు మూడో రోజున మీనా కుమారి దగ్గరకు వచ్చింది. కుమారి ఆనందానికి పట్టె పగ్గాల్లేవు. ఉన్న ఒక్క గదిని పదిసార్లు సర్దింది. ఇంట్లో వున్న సరుకుల్లో తనెంత బాగా వండగలదో అంత బాగా వండి, వడ్డించింది. మీనాకి గోరుముద్దలు తినిపించింది.

రమేష్ నవ్వుతూ చూస్తున్న ప్రేక్షకుడయ్యాడు. మీనా మౌనంగా, అంటీ ముట్టనట్లుగా వుంది. కుమారికి మీనా వచ్చిందన్న సంతోషమే కానీ మీనా ఎలా వుందన్నది పట్టనేలేదు.

రాత్రి వసారాలో వంటరిగా పడుకున్నప్పుడు కుమారికి రమణ గుర్తొచ్చాడు. ఏదో భయం వెన్నులో జరజరమని పాకింది. రాత్రికేమన్నా వూడి పడతాడేమోనని బిక్కుబిక్కుమంటూ కూర్చుంది. రమణ రాలేదు. వేకువనే మీనా వాళ్ళు వెళ్ళి పోయారు.

చూస్తుండగానే మీనా పదహారు రోజుల పండుగ కూడా అయిపోయింది. ఈలోగా రమేష్ మీనాని కుమారి దగ్గరకు రెండు మూడు సార్లు తీసుకొచ్చాడు.

మీనా మొదట్లో ముభావంగా వున్నా, రమేష్ ప్రోద్బలంతో ముక్తసరిగా, ఏదో పలకరించాలి కాబట్టి కుమారిని పలకరించింది.

చివరికో రోజు రమణ వచ్చాడు. అదీ కుమారి, రేఖ వాళ్ళింట్లో వున్న సమయంలో బైట నిల్చుని బర్జీ కొట్టు కుర్రాడితో కబురుపెట్టాడు. కుమారి చేస్తున్న పని ఆపి, ఉరుకులు పరుగుల మీద వెళ్ళింది. అప్పటికే ఆలస్యం చేసిందని రమణ అలిగి వెళ్ళిపోయాడు. కుమారి పని తొందరగా ముగించుకొని, గబగబ ఇంటికి వెళ్ళింది. గుమ్మంలోకి అడుగు పెట్టీ పెట్టంగానే రమణ విరుచుకుపడ్డాడు.

తనను కూడా పట్టించుకోనంత పనిమంతురాలయ్యిందని చిందులు తొక్కాడు. కుమారిని వంగదీసి నాలుగు గుద్దులు కూడా గుద్దాడు.

కుమారి రమణను అడుగుదామని అనుకున్నవన్నీ అడుగున పడిపోయాయి. రమణ ప్రవర్తన హఠాత్తుగా ఎందుకు మారిందో అర్థం కాలేదు. మీనా వచ్చిందని తెలిసిందా? మీనా రావడం ఇష్టం లేదా? మరి పెళ్ళి విషయాలు మాట్లాడేప్పుడు చాలా చొరవ చూపించాడుగా?

రమణకి ఆవేశం తగ్గాక, పనిలో పడి కుమారి తనను నిర్లక్ష్యం చేస్తుందేమోనని తన భయమని చెప్పాడు. కుమారి నిర్లక్ష్యం కన్నా గుక్కెడు విషం మేలన్నాడు.

కుమారి కదిలిపోయింది. దెబ్బల తాకిడిని ఈ మాటలు మాయం చేసాయి.

మీనా పెళ్ళి విషయాలు ఎప్పటికోగాని వారి మధ్య రాలేదు. మాటల్లో రేఖ డబ్బు సర్దిన విషయం తెలుసుకొని రమణ డాబుగా అన్నాడు. ''అవిడ్నేం దిగులు పడొద్దను. వారం రోజుల్లో ఆమె డబ్బు ఆమె మొహాన పడేద్దవు!''

కుమారి ఆశించింది అదే. తృప్తిగా అతని పనుల్లో మునిగిపోయింది.

రమణ డబ్బు తేకుండానే వారం గడిచింది. రెండు వారాలు. మూడువారాలు. నాలుగో వారం చివర్లో-రేఖ కుమారి జీతాన్ని ఇవ్వాల్సిన డబ్బులకి చెల్లు పెట్టింది.

ఇలాగే అయితే, కుమారి చేతికి జీతం రావడానికి ఐదు నెలలు గడవాలి.

కుమారి రమణ కోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది. కట్టాల్సిన అద్దె కోసం ఇంటి ఓనరు గుమ్మం దిగడం లేదు. కరెంట్ పూర్తిగా ఆపేసాడు. పచారి కొట్లో డబ్బులు కట్టాలి. రమణ మళ్ళీ అయిపులేడు. కుమారికి మళ్ళీ టాక్సీ ఓనరు చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు.

కుమారి ఒక్క ప్రాణానికి రేఖ ఇంట్లో పెట్టే తిండి సరిపోతుంది. ఇక

ఓ చుక్క తలనూనె, ఓ చిన్న సబ్బు బిళ్ళ... ఇలాంటివైనా కావాలిగా!

వరం ఏమనుకుందో ఏమో జీతం రాగానే ఓ పది రూపాయలు కుమారి చేతిలో పెట్టింది. కుమారి తటపటాయిస్తూనే తీసుకుంది. ఆరోజు సాయంత్రమే మీనా వాళ్ళు వచ్చారు. వస్తూ కాసిని సరుకులు, కాసిని కూరగాయలు తెచ్చారు. రమేష్ ఇంటి ఓనరుతో మాట్లాడి వచ్చాడు. వెళుతూ వెళుతూ ఓ పాతిక కుమారి చేతికి ఇచ్చాడు. ఎంతయినా కన్నబిడ్డ కన్నబిడ్డేనని కుమారి మీనాకి మెటికలు విరిచింది. రాత్రి ఆనందంగా, ధైర్యంగా నిద్రపోయింది.

అర్ధరాత్రి దాటాక రమణ వచ్చాడు.

కుమారి సివంగిలాగా ఒక్కసారి మీద పడింది. ఈ పాటి భాగ్యానికి అతన్ని అనవసరంగా నమ్ముకు వచ్చానని వాపోయింది. వాదించింది. ఏడ్చింది. మొత్తుకుంది.

రమణ అంతకన్నా దీటుగా వాదించాడు. ఉంచుకున్నదంటే తుమ్మితే వూడిపోయే ముక్కు లాంటిదని వప్పుకొనేలా వాదించాడు. ఆమెకు అతీ గతీ స్థితీ అన్నీ అతనేనని, అతని దయాదాక్షిణ్యాలే ఆమె భోగ భాగ్యాలని అంగీకరించేలా వాదించాడు.

రమణ ఓ రోజు తన తరహాలో ఓ ప్రతిపాదన తెచ్చాడు. డబ్బు చెల్లుబెట్టాలని ఇంకా నాలుగు జీతాలు రేఖ ఇవ్వదు కనుక పనే మానేయమన్నాడు.

కుమారి అంగీకరించలేదు. సమయానికి ఆదుకున్నందుకు చేయాల్సిన మర్యాద డబ్బు ఎగ్గొట్టి వేయడమేనా?

రమణ ఇంకో రోజన్నాడు- డ్రైవర్ భార్యవై వుండి పాచి పనికి వెళ్తుందంటే సాటి డ్రైవర్ల ముందు తలకొట్టేసినట్లుగా వుందని.

రోజురోజుకీ కుమారి మీద వత్తిడి పెరిగింది. ఓ రాత్రి రమణ కుమారిని పట్టుకొని చిన్న పిల్లాడిలా ఏడ్చాడు. పన్లోకి వెళ్ళాక పూచికపుల్లలా అయిపోయిందని బాధపడ్డాడు. కుమారి మనసు కరిగిపోయింది. రమణను అపార్థం చేసుకున్నందుకు లెంపలు వేసుకుంది.

మర్నాడు వెళ్ళి వరంతో ఓ మాట చెప్పి పని మానేద్దామని బయలుదేరింది. వరం కుమారి కోసమే ఎదురుచూస్తోంది.

''గొర్రె కసాయి వాడినే నమ్ముతుందన్నట్లు నువ్వాడినే నమ్ముతావు. ఉద్యోగం వచ్చిందట. రత్నను తీసుకొని తిరుపతిలో కాపురం పెట్టబోతున్నాడు. రత్న నీపీడ విరగడి అయ్యిందని గుళ్ళో అభిషేకం కూడా చేయించిందట. ఈ

సాయంత్రం రైలుకే ప్రయాణం.''

కుమారి స్తంభించిపోయింది.

ఈ వేకువదాకా వొలకబోసిన రమణ ప్రేమంతా వొట్టిదేనా? ఉద్యోగం వస్తే గొప్పగా, దర్జాగా చూసుకొంటానని చెప్పిన మాటలన్నీ గాలి మూటలేనా? ఉద్యోగం వచ్చిందని మాట మాత్రం చెప్పనివాడు తనను తీసుకెళ్ళి కాపురం పెడతాడా? రమణ నిజంగానే తనని వదిలేసి వెళతాడా?

కుమారి ఇంక ఆలోచించదలుచుకోలేదు. తిన్నగా పన్లోకి వెళ్ళింది. పని చేసుకొని ఇంటికి వెళ్ళేసరికి ఇల్లంతా కెలికేసినట్లుగా గందరగోళంగా వుంది. పెట్టెలు బోర్లా వేసి వున్నాయి. కాగితాలన్నీ చిందరవందరగా పడివున్నాయి. కుమారికి అంతా అయోమయంగా వుంది.

ఓ పక్కగా పడి వున్న మీనా ఫోటో తీసుకొని గోడకు ఆన్చింది. ఓనరింటికి వెళ్ళి ఎవరైనా వచ్చెళ్ళారేమో ఆరా తీసింది. రమణ వెళ్ళాక ఎవరూ రాలేదంది ఆవిడ.

ఎక్కడి సామాను అక్కడ సర్దుతున్న కుమారికి గదిలో ఏం పోయాయో ఓ పట్టాన అర్థం కాలేదు. గోడకు తగిలించిన ఫోటోలు లేవు. తను, రమణ ఎప్పుడెప్పుడో రాసుకున్న ఉత్తరాలు లేవు. రమణ డ్రైవింగ్ లైసెన్స్, రమణ బట్టలు ఏవీ లేవు.

అవి లేవని కుమారికి ఎప్పటికో కానీ అర్థం కాలేదు. అర్థం అయ్యాక అవే ఎందుకు లేవో అసలు అర్థం కాలేదు. నిజానికి వరం చెప్పిన విషయాన్నే ఆలోచిస్తూ ఈ సంగతిని తేలిగ్గా వదిలేసింది. కన్నీరు మున్నీరుగా ఏడవడమే సరిపోతోంది.

ఆశ్చర్యంగా... ఆ రాత్రి రమణ వచ్చాడు. జిలేబి, పూలు తెచ్చాడు. చాలా రోజుల తరువాత సంతోషంగా కనిపించాడు. కుమారితో ఉత్సాహంగా కబుర్లు చెప్పాడు. ఉద్యోగం విషయమే ఎత్తలేదు. కుమారికి అంతా అయోమయంగా వుంది.

రమణ తనను వదిలి వెళతాడా? ఛ! అలా ఎందుకు చేస్తాడు! వరం అబద్ధం చెప్తుంటుంది! కుమారి తనకై తను సమాధాన పడింది.

రమణ ఆ వుదయాన్నే వెళుతూ కుమారిని పని మానేయమని వప్పించి, ఒట్టు వేయించుకొని మరీ వెళ్ళాడు.

కుమారి ఎప్పటిలానే పనికి వెళ్ళింది. పని ముగించుకొని వస్తోన్న కుమారికి హఠాత్తుగా కడుపు నొప్పి మొదలయ్యింది, రేఖ ఇంటి మెట్ల మీదే కూలబడింది.

కడుపులో నొప్పి విపరీతంగా ప్రాణం నిలవలేనంతగా వచ్చింది. కుమారి మూలుగు విని రేఖ బయటకు వచ్చింది. గబుక్కున లోపలికి తీసుకెళ్ళింది. వరంకు కబురు చేసింది. డ్యాక్టర్‌కు ఉత్తరం రాసి, వరం చేతిలో డబ్బు పెట్టి, స్వయంగా రిక్షా ఎక్కించింది. వెనకే తలుపు తాళం వేసుకొని తనూ బయలు దేరింది.

డ్యాక్టర్ సలహాతో కుమారికి వెంట వెంటనే స్కానింగ్ వగైరాలు జరిగిపోయాయి. మూత్రాశయంలో రాయి వున్నట్లుగా తేలింది. ఆపరేషన్ అవసరం రాకపోవచ్చని...కొన్ని మందులు వ్రాసి ఇచ్చాడు డ్యాక్టర్. బాగా నీరు, ద్రవ పదార్థాలు తాగిస్తే..రాయి దానంతట అదే వచ్చేయవచ్చునన్నాడు.

వరం శోకాలు పెట్టింది- ఇలాంటి జబ్బు ఇంటా వంటా ఎరగం అంటూ, ఆ రత్న వుసురు తగిలిందని రహస్యంగా ముక్కు చీదింది.

ఇంతలో ఎవరో చెప్పినట్లుగా మీనా, రమేష్ వచ్చారు. బాధతో మెలికలు తిరిగి పోతోన్న కుమారిని చూసి మీనా కొద్దిగా చలించింది. రేఖ మందులు కొనిచ్చి, వెళ్ళిపోయింది. వరంని తోడు తీసుకొని, మీనా, రమేష్ - కుమారిని ఇంటికి తీసుకెళ్ళారు.

వరం పక్క సర్ది కుమారిని పడుకోబెట్టింది. రమేష్ కొబ్బరిబోండాలు కొట్టించుకు వచ్చాడు. మీనా కాసేపటికి ఓ సారి కుమారి చేత ఏదో ఒకటి తాగిస్తోంది. మీనా ఏం చేస్తున్నా దాన్లో ఆత్మీయభావం లేదు. పరాయి వారికి చేసినట్లే ముక్కుబడిగా చేస్తోంది.

చిన్న పిల్లల మీద వదిలేయక తప్పడం లేదని బాధపడుతూనే వరం వెళ్ళిపోయింది. మీనా, రమేష్ రాత్రంతా కుమారికి చెరోపక్కా కూర్చునే వున్నారు.

ఎప్పటికో నొప్పి కడుపులో కదలి కదిలి కరిగిపోయినట్లనిపించింది. కుమారి సొమ్మసిల్లినట్లుగా పడి వుంది. అందరూ కాస్త కునుకు తీసారు.

సరిగ్గా అప్పుడే రమణ వచ్చాడు.

రమణకి గదిలోకి రాగానే ఏదో మార్పు కనిపించింది. మూడు ఆకారాలు అడ్డ దిడ్డంగా పడి వున్నాయి. రమణ మెల్లిగా దీపం వత్తి పెద్దది చేసాడు. కుమారిని తట్టి లేపాడు. సాయంత్రం రేఖ ఇంటికి వస్తే లేదనీ, ఎక్కడ పెత్తనాలకి వూరేగి, ఎవర్ని వెంటేసుకొచ్చిందని తిట్టి లేపాడు.

మీనా, రమేష్ ఉలిక్కిపడి లేచారు. కుమారి నిర్లిప్తంగా కదలకుండా పడుకోవడంతో రమణ కుమారి భుజాలు పట్టిలేపి...కూర్చోబెట్టాడు. కుమారి నిర్లక్ష్యధోరణికి తిట్టి పోయడం మొదలెట్టాడు.

రమేష్ వేగంగా కదలబోయాడు. మీనా 'నీకు అనవసరమ'ని సైగ చేసింది.

రమేష్ బయటకు వెళ్ళి వాకిలికి చేరగిల పడ్డాడు. మీనా నెమ్మదిగా గోడకు నక్కింది.

కుమారి బలహీనంగా వున్న కంఠాన్ని కూడ తీసుకొని జరిగిందేమిటో చెప్పింది. రమణ ఈసారి మరింత ఆవేశపడ్డాడు.

''నీకు వంట్లో బాలేదని ముందు నాకు చెప్పకుండా వూళ్ళో వున్న వాళ్ళందరికీ చెప్తావా?'' అంటూ కుమారిని వంగదీసి బాదాడు.

రమేష్ ఒక్క పరుగున వచ్చాడు. రమణను ఒక్క తోపు తోసాడు. రమణ రమేష్‌ని కలబడి కొట్టాడు. రమేష్ తిరగబడ్డాడు. రమణ కుమారి దగ్గరకి వెళ్ళి, నా పెళ్ళాం నా ఇష్టమని మరీ మరీ బాదాడు. మీనా రమేష్‌ను బతిమిలాడి పక్కకి లాక్కెళ్ళింది.

బంతిలాగా అటూ ఇటూ తంతున్నా కుమారి కిమ్మన లేదు. మీనా తన తల్లి భోగాన్ని కళ్ళప్పగించి చూస్తోంది. తనుంటే మరింత దౌర్జన్యం చేస్తాడని రమేష్ వాకిట్లోకి వెళ్ళి నిలబడ్డాడు.

కుమారి మనసును రమణ మాటలుగానీ, శరీరాన్ని దెబ్బలుగానీ గాయపరచడం లేదు. రేఖ చెప్పిన మాటలే కుమారి చెవుల్లో గింగురుమంటున్నాయి. గవర్నమెంటు ఉద్యోగానికి రెండో పెళ్ళాం వుండకూడదట. ఉందని తెలిస్తే ఉద్యోగం వూడగొట్టి మరీ శిక్ష వేస్తారట. అందుకేగా ఫోటోలు, ఉత్తరాలు అన్నీ దొంగచాటుగా పట్టు కెళ్ళాడు. అయినా తనో పెళ్ళాం! తను పస్తులుండి చచ్చినా ఫర్వాలేదు గానీ పాచిపని చేస్తే నామర్దా, పెళ్ళాం పిల్లల్ని టాక్సీలో తిప్పుతాడు. ఘనంగా కాపురం చేస్తాడు. తను మాత్రం రెండు చీరల సంసారం చేయాలి. ఆళ్ళే కావాలనుకున్నవాడు మరి తననెందుకు వదిలిపెట్టడు?

కుమారికి ఏం వచ్చిందో ఏమో అంత నీరసంలోనూ అరిచింది, ''నువ్వు బయటకు నడువ్''

రమణ కొట్టడం ఆపి, పెళ్ళున నవ్వాడు, విరగబడి నవ్వాడు. కప్పెగిరేలా నవ్వాడు.నవ్వి నవ్వి ఆగి, ''మొగుడ్నొదిలి వూరంట పడిందానివి... ఏదో దయచూప బట్టి ఇలా వున్నావే! నేనే గతి లేకపోతే కుక్క ముందు పడ్డ ఎంగిలాకు వవుతావే!''అంటూనే నవ్వాడు.

'' ఎట్లా చస్తే నీకెందుకు? నువ్వు ముందు ఇక్కణ్ణించి వెళ్ళు. వెళ్ళిపో!'' కుమారికి క్షీణంగా అరిచింది.

'' ఏందే ఎగిరెగిరి పడతన్నావ్-జాగ్రత్త! గడప దాటానంటే మళ్ళీ అడుగు పెట్టను. తరవాత నీ ఖర్మ!'' రమణ కుమారి జుట్టు పట్టి లాగి, మొహంలో మొహం పెట్టి అన్నాడు.

రమణ మొహం జేవురించి వుంది. మాటలు మొరటుగా వస్తున్నాయి.

"ముందెళ్ళి పో!" కుమారి జుట్టు కుదుళ్ళు విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ అంది.

మీనా భయం భయంగా వాకిలి వైపు జరిగింది. రమేష్ లోపలికి వచ్చి నిల్చున్నాడు.

రమణ బండబూతులు తిడుతూ కుమారిని లేపి నిల్చోబెట్టాడు. రమేష్‌ను చూపిస్తూ గొంతు చించుకుని అరిచాడు, "ఈడ్ని చూసుకొనేగా నీకా ధైర్యం! కూతురి మొగుడితో కులకడం నేర్చావ్... ఇక చెల్లెలు మొగుడు ఎక్కడ కన్పిస్తాడు...?" అతని మాటలు పూర్తికాక ముందే రమేష్ బలవంతంగా అతన్ని బయటకు నెట్టాడు.

కుమారి కుప్పకూలిపోయింది.

మీనా కళ్ళు బైర్లు కమ్మాయి.

రమణ వాకిట్లో నిల్చోని బండబూతులు తిడుతున్నాడు. చిందులు తొక్కుతున్నాడు. రమేష్ అతనిని వీధి మలుపు దాకా నెట్టుకెళ్ళాడు.

కుమారి, మీనా ఎక్కడి వాళ్ళక్కడ కూలబడ్డారు. ఎప్పటిదాకా అలా కూర్చున్నారో వారికి స్పృహ లేదు.

వేకువన తొలి కిరణం వాకిలిలో వెలుగు ముగ్గులు పెడుతున్నప్పుడు మీనా లోకంలోకి పడింది. చుట్టూ చూసింది. కుమారి వాకిలి వైపే చూస్తోంది.

మీనా మెల్లిగా లేచి కుమారి దగ్గరికి వచ్చింది కుమారి వళ్ళో చేయి వేసి, బేలగా అంది, "నాయనా లేక... ఈయనా లేక ఎట్లా బతుకుతావే అమ్మా!"

"నిన్నట్లా మాత్రం కాదు."

కుమారి కంఠంలో ఏం ధ్వనించిందో కానీ మీనా తల్లిని వాటేసుకొని ముద్దాడింది.

✿

కథా నిలయం
754
శ్రీకాకుళం

వనిత డిసెంబర్ 1995